క్లుప్తంగా

కలికిరి తాత్కాలిక సర్పంచ్‌గా ఎల్లప్ప

కలికిరి : మండలంలోని కలికిరి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా 14వ వార్డు సభ్యుడు ఎల్లప్పకు బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ వీఆర్ క్రిష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. కలికిరి గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రతాప్‌కుమార్ రెడ్డి ఈ ఏడాది మే 15న అనారోగ్యంతో అకాలమరణం చెందారు. జూన్ 28న ఉప సర్పంచ్ నూరిన్నిషా సైతం తన పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీకి సంబంధించి పరిపాలన ఇబ్బందులు తలెత్తడంతో జూన్ 11న పంచాయతీ ఈఓ ఆధ్వర్యంలో సమావేశమైన వార్డు సభ్యులు 14వ వార్డు సభ్యుడు ఎల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకుని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు పీఆర్, ఆర్డీ పీడీ ఎల్లయ్యను తాత్కాలిక సర్పంచ్‌గా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్షయవ్యాధి రహిత సమాజం నిర్మిద్దాం

వాల్మీకిపురం : క్షయవ్యాధి లేని సమాజం కోసం పెద్దలకు బీసీజీ టీకా వేయిద్దామని టీబీ యూనిట్ పర్యవేక్షకులు నాగిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ మురళి అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్డిపల్లి, స్థానిక ప్రభుత్వాసుపత్రి నందు బీసీజీ టీకాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాల నుంచి దగ్గు, సాయంత్ర వేళల్లో జ్వరం, దగ్గుతో పాటు రక్తపు మరకల గళ్ళ పడడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే ప్రభుత్వాసుపత్రి నందు గళ్ల పరీక్ష, ఛాతి ఎక్స్‌రే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అలాగే ప్రతి సోమ, గురువారాల్లో ఆరోగ్య కేంద్రాల్లో పెద్దలకు టిబి రాకుండా బీసీజీ టీకాలు వేయడం జరుగుతుందన్నారు.

విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం

మదనపల్లె సిటీ : విద్యావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో మదనపల్లె నియోజకవర్గం నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ విద్యావిధానం అమలుపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. ఏఐఎస్ఎఫ్ సీనియర్ నాయకులు మురళి, మదనపల్లె నియోజకవర్గ నూతన కమిటీ అధ్యక్షుడిగా శ్రీనాథ్, కార్యదర్శులుగా శ్రీకాంత్, మహేష్, భానుప్రకాష్, కోశాధికారిగా సుఫియాలను ఎన్నుకున్నారు. అనంతరం నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ 15,000 సభ్యత్వం జిల్లా కమిటీకి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కమలాకర్, ఉపాధ్యక్షులు వినయ్‌లు అందజేశారు.

తాలూకా సీఐగా కళా వెంకటరమణ



మదనపల్లె : తాలూకా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.కళావెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సీఐ బదిలీలలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్.శేఖర్ అన్నమయ్య జిల్లా రాయచోటి వేకెన్సీ రిజర్వుకు బదిలీ కాగా, తిరుపతి ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న కళావెంకటరమణ ఆయన స్థానంలో ఇక్కడికి బదిలీ అయ్యారు.

ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి

రామసముద్రం : రామసముద్రంలో శుక్రవారం మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఇంహం ఆనంద్‌నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, యువమోర్చ నెల్లూరు జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాస మోదీ, మండల ప్రధాన కార్యదర్శి శేఖర్, యువమోర్చ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, వీరకుమార్, వెంకటేష్, శీన, నవీన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి

మదనపల్లె సిటీ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఐదవ వార్షికోత్సవం స్థానిక జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం జరిగింది. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వంచారు. సంఘ అధ్యక్షులు నాగేంద్ర బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గురుప్రసాద్, సహాయ కార్యదర్శి శివరాంప్రసాద్, కోశాధికారి ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు మండల అధ్యక్షుడుగా కృష్ణప్ప

రామసముద్రం : మండల మాలమహానాడు అధ్యక్షుడుగా మట్లవారిపల్లెకు చెందిన టి.కృష్ణప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం తెలిపారు. శుక్రవారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో కార్యవర్గ సభ్యుల ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కొమ్ము నారాయణస్వామి, ఉపాధ్యక్షుడిగా కె.వెంకటేష, రమణప్ప, ప్రధాన కార్యదర్శిగా ఎస్. శివ, సహాయ కార్యదర్శులు నరసింహులు, శీనప్ప, ప్రచార కార్యదర్శి కృష్ణప్ప, కోశాధికారిగా చంద్రప్పతో పాటు పది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మాజీ జెడ్పీటీసీ శివశంకర్, బాలాజీ, నరసింహులు, డాక్టర్ శివ, శేషు, సత్యప్ప, జయరాజ్ పాల్గొన్నారు.

వరలక్ష్మీ.. నమోస్తుతే..!

- భక్తిశ్రద్ధలతో మహిళలు వ్రతం ఆచారణ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కలికిరి: ఎల్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు



కురబలకోట: మిట్స్ కళాశాలలో వరలక్ష్మి వ్రతం



పీలేరు: పుట్టవద్ద పూజలు చేస్తున్న మహిళలు



రామసముద్రం : వరలక్ష్మీ వత్రం పూజలు చేస్తున్న మహిళలు

మదనపల్లె సిటీ : సర్వపాపహరిణీ పాహిమాం అంటూ ఆ వరలక్ష్మిదేవిని భక్తిప్రపత్తులతో కొలిచారు. శ్రావణ శుక్రవారం పూజలతో ప్రతి ఇంటా పండుగ శోభ వచ్చింది. ఉదయం నుంచి ఉపవాసదీక్షలతో వ్రతం ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. మదనపల్లె పట్టణం, రూరల్ పరిధిలో అమ్మవారి ఆలయాల్లో రద్దీ నెలకొంది. మహిళలు తమ గృహాల్లో వరలక్ష్మీ ప్రతిమ ఏర్పాటు చేసి ప్రత్యేక వ్రతాలు నిర్వహించారు. పిండి వంటలు నైవేద్యంగా సమర్పించి వ్రతాన్ని ఆచరించారు. ముత్తయిదవలకు వాయినాలు అందజేశారు. స్థానిక బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మివ్రతం నిర్వహించారు. అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ వ్రత సంకల్పంను చదివి వినిపించారు. మహిళలు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.స్థానిక వాసవీభవన్‌వీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

రామసముద్రం : మండలంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో, పట్టుచీరలు, బంగారు ఆభరణాలు, కరెన్సీ నోట్లు పెట్టి అమ్మవార్లను అలంకరించారు.

పీలేరు : స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో, మండలంలోని అగ్రహారంలో వెలసిన అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీవ్రత పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో మహిళా భక్తులు వరలక్ష్మీ వ్రతం చేపట్టారు. తమ కుటుంబాలను చల్లగా చూడాలని, తమ పిల్లకు విద్యాబుద్ధులు ప్రసాదించాలని కోరుకున్నారు. పలు ఆలయాల్లో వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. అలాగే పలుచోట్ల పుట్టకు పూజలు చేశారు.

గుర్రంకొండ : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీ వరలక్ష్మీ దేవి వ్రత పండుగ వేడుకలను మహిళలు శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. గుర్రంకొండలోని పలు ఆలయాలతో పాటు చెర్లోపల్లెలో వెలసిన సంతానదేవత శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. అమ్మవార్లను రంగురంగులు పుష్పాలతో అందంగా అలంకరించారు. ఈసందర్భంగా ఇళ్లలో పూర్ణ కుంభాలు ఏర్పాటు చేసుకొన్నారు. వాటిపై పసుపుముద్దతో వరలక్ష్మీదేవి ప్రతిమను ప్రతిష్టించారు.

వాల్మీకిపురం : మండల వ్యాప్తంగా మహిళలు వరలక్ష్మీవ్రతం నోములను శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీవ్రతం నోములను అర్చకులు నోయించారు. అలాగే తమ తమ ఇండ్లలో సైతం వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన వరలక్ష్మిదేవి ప్రతిమలను ప్రతిష్ఠింపజేశారు. రకరకాల పిండి వంటలను అమ్మవార్లకు సమర్పించుకొని భక్తిశ్రద్ధలతో నోములు నోచుకున్నారు.

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం జరిగిన వరలక్ష్మీ వ్రతం వేడుకలను ఘనంగా నిర్వహించారు. లక్ష్మీమాత ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. మహిళలు వేకువ జామునే ఆలయాలకు వెళ్ళి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నిమ్మనపల్లె : శ్రావణమాసంలో వచ్చే వరలక్ష్మీ వ్రత పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం మహిళలు భక్తి శ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. మండలంలోని రాచవేటి వారి పల్లె పంచాయతీ, ఎగువమాచిరెడ్డి గారి పల్లె వద్దనున్న అక్కదేవతల గుడిలో విశేష పూజలు నిర్వహించారు.

కలకడ : మండలంలోని అమ్మవారి ఆలయాల్లో, స్థానిక శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వరస్వామివారి ఆలయంలో వరలక్ష్మీవ్రతం పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఉదయం మహిళలు అధికంగా ఉపవాసదీక్షలతో ప్రత్యేక పూజలు చేశారు. నాగుల విగ్రహాలకు దారం చుట్టి, లక్ష్మిదేవి పూజలు చేశారు.

వరాల ఇలవేల్పు వరలక్ష్మి

కురబలకోట : అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో స్థానిక రెడ్డెప్పనాయుడు కాలనీలో వరలక్ష్మి వ్రతం పండగలా నిర్వహించారు. కళాశాల నిర్వాహకులు డాక్టర్ నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా, తంబళ్లపల్లె నియోజక వర్గ టీడీపీ నాయకుడు దాసరిపల్లె జయచంద్రారెడ్డి, బీజేపీ నా యకులు చల్లపల్లె నరసింహారెడ్డి, నాదేళ్ల ద్వారకనాథ్, విద్యా సాగర్ తదితరులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలికిరి : వరలక్ష్మీవ్రతం సందర్భంగా భక్తిశ్రద్ధలతో భక్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామదేవత ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, విశేష అలంకరణ చేశారు.



మదనపల్లె : యోగభోగేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రతం చేస్తున్న అర్చకులు



మదనపల్లె : గాజుల అలంకారంలో కోర్టులో గంగమ్మ



గుర్రంకొండ: ప్రత్యేక అలంకారంలో రెడ్డెమ్మ తల్లి



వాల్మీకిపురం : విశేషాలంకరణలో వరలక్ష్మిదేవి

కంప్యూటరీకరణ దిశగా సహకార సంఘాలు

- సహకార సంఘాల బలోపేతానికి చర్యలు
- డీసీసీబీ ఏజీఎం కిరణ్ కుమార్



సింగిల్ విండో కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏజీఎం కిరణ్ కుమార్

నిమ్మనపల్లె : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను పూర్తిస్థాయి కంప్యూటరీకరణ దిశగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీసీసీ బ్యాంక్ ఏజీఎం కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం నిమ్మనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సింగిల్ విండో) కార్యాలయంలో స్థానిక తహసిల్దార్ ధనంజయలు, ఎంపీడీఓ రమేష్ బాబు, డీసీసీ బ్యాంక్ మేనేజర్ పవిత్ర లతో కలిసి సంఘాల కంప్యూటరీకరణ ప్రక్రియను పరిశీలించారు. సహకార సంఘంలోని రైతులకు సంబంధించి, లోన్ , భూముల వివరాలను తనిఖీ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 96 వేల వ్యవసాయ సహకార సంఘాల సంఖ్య 3 లక్షల కు పెంచడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు . అందులో భాగంగానే రాష్ట్రంలోని 2053 వ్యవసాయ సహకార సంఘాలను 100 రోజుల్లో (అక్టోబర్ 2వ తేదీ) నాటికీ పూర్తి స్థాయిలో కంప్యూటరీకరణ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలోని, నిమ్మనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. నిమ్మనపల్లి సహకార సంఘంలో 4961 ఖాతాలు ఉండగా 3873 ఖాతాలకు రైతుల ఈకేవైసీ ద్వారా లోన్, షేర్ క్యాపిటల్, భూములవివరాలు ఆన్ లైన్ లో పొందుపరచడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి మండల అధికారులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సహకార సంఘం సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సీఈఓ హరినాథ్ రెడ్డి, సిబ్బంది వేణుగోపాల్ రెడ్డి, ధనంజయలు తదితరులు పాల్గొన్నారు.

అమూల్ డెయిరీ మూసివేత ప్రతిపాదన విరమించుకోవాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె : రాయలసీమ జిల్లాల్లో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తున్న పాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్న అమూల్ డెయిరీని మూసివేయాలన్న ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మదనపల్లె అమూల్ డెయిరీ వద్ద శనివారం పాడి రైతులు చేపట్టనున్న ఆందోళనకు ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా సమితి సంపూర్ణ సంఘీభావం తెలుపుతోందన్నారు. రైతులకు ఏఐటీయూసీ అండగా ఉంటుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ తెలిపారు. అమూల్ డెయిరీ పాడి రైతులకు లీటర్ పాలుకు 37 రూపాయల నుండి 43 రూపాయలు చెల్లిస్తుండగా ప్రైవేట్ డెయిరీలు మాత్రం కేవలం 27 రూపాయల నుంచి 33 రూపాయలే చెల్లిస్తూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. డెయిరీని మూసివేస్తే పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తున్న రైతాంగం నష్టపోతారన్నారు. ప్రైవేటు డెయిరీ యజమానులకు అనుకూలంగా చేసే నిర్ణయాలు మానుకోవాలని హితవు పలికారు.

పేదోడి ఆకలి తీర్చేందుకే క్యాంటీన్లు



ఆహారపదార్థాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : పేదోడి ఆకలి తీర్చేందుకే అన్నా క్యాంటీన్‌లను పునః ప్రారంభించినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్‌యార్డు, సంతగేటు సమీపంలోని రెండు అన్న క్యాంటీన్‌లను సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేవలం రూ.5కే కడుపునిండా రుచికరమైన భోజనం పెట్టడం అద్భుతమన్నారు. క్యాంటీన్‌ల నిర్వహణ కోసం పట్టణానికి చెందిన విష్ణు జ్యువలరీస్ అధినేత అనిల్, కుటుంబసభ్యులు రూ.50వేల విరాళం అందించడంపై అభినందనలు తెలిపారు. క్యాంటీన్‌లను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరామ్ చినబాబు, నాదెళ్ల విద్యాసాగర్, రాటకొండ గుర్రప్పనాయుడు, నవీన్, నీలకంఠ, భవానీప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్ ఖాజాబీ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పంచాయతీని అభివృద్ధి చేద్దాం

సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా



బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : సమష్టి కృషితో పీలేరు గ్రామ పంచాయతీని అభివృద్ధి చేద్దామని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. 11 నెలలు పాటు సెలవులో ఉన్న సర్పంచ్ హబీబ్‌బాషా శుక్రవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు అందించడానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పీలేరు పంచాయతీ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. వార్డు మెంబర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు విక్టరీ వెంకటరమణారెడ్డి, నాగభూషం, ఆబిద్, శ్రీనాథరెడ్డి, సాంబశివారెడ్డి, కాలేషా, రమణ, తాసూర్, సచిన్, నాయకులు నారే వెంకటరమణారెడ్డి, ఆనంద్, బాలం నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టం సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

- దేశాన్ని మతపరంగా విభజించేందుకు కేంద్రం కుట్ర
- ముస్లింలకు అండగా వైఎస్సార్ సీపీ
- చట్టం అమల్లోకి రాకుండా చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఎన్నికల హామీని నిలుపుకోవాలి



వక్ఫ్ చట్టం సవరణ బిల్లుపై మాట్లాడుతున్న నిసార్‌అహ్మద్, మైనారిటీ నాయకులు

మదనపల్లె : వక్ఫ్ చట్టానికి కీలక సవరణలు చేసే ఉద్దేశంతో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం సవరణ బిల్లు–2024 రాజ్యాంగ విరుద్ధమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్యారేజాన్ గార్డెన్స్‌లో మదనపల్లె నియోజకవర్గ ముస్లిం ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ అంటే అమ్మేందుకు, కొనేందుకు హక్కులేని భూములని అర్థమని, ప్రపంచ వ్యాప్తంగా వక్ఫ్‌భూములు ఉన్నాయన్నారు. దాతలు తమ భూములను పేదలకు ఉపయోగపడే విధంగా దానం చేసిన వాటికే వక్ఫ్‌భూములుగా పేరు వచ్చిందన్నారు. దేశంలో 9లక్షల 50వేల ఎకరాల వక్ఫ్‌భూములు, 8లక్షల 70వేల ఆస్తులు వక్ఫ్‌బోర్డులో నమోదై ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 66వేల ఎకరాల వక్ఫ్‌భూములు ఉంటే, వాటిలో 30వేల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని, 20వేల ఎకరాలు కర్నూలు జిల్లాలో ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో 25వేల కోట్ల విలువచేసే వక్ఫ్‌భూములు ఉన్నాయన్నారు. 1954లో జవహర్‌లాల్ నెహ్రూ, 1995లో పీ.వి.నరసింహారావు వక్ఫ్‌చట్టంను తీసుకువస్తే, 2024లో ఎన్డీఏ ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో దాదాపు 40 సవరణలు ప్రతిపాదించడంపై తమకు అభ్యంతరాలున్నాయన్నారు. వక్ఫ్‌బోర్డు అధికారాలను పరిమితం చేయడంతో పాటు ముస్లిం మహిళలను, ముస్లిమేతరులనూ వక్ఫ్‌బోర్డులో సభ్యులుగా చేసేలా బిల్లును తయారు చేశారన్నారు. ఈ చట్టం అమల్లోకి వస్తే జిల్లా కలెక్టర్లు రూపొందించిన వాస్తవ అంచనా విలువల మేర వక్ఫ్‌బోర్డులు తమ ఆస్తులను తప్పనిసరిగా నమోదుచేసుకోవాల్సి ఉంటుందన్నారు. సవరణలు సరైన నిర్ణయం కాదని, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వ్యతిరేకించిందని, లోక్‌సభలో ఎన్డీఏ కూటమిలోని పార్టీలైన టీడీపీ వక్ఫ్‌చట్టం సవరణ బిల్లుకు మద్దతుగా నిలిస్తే... ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలతో ఏకీభవిస్తూ..వైఎస్సార్‌సీపీ తరపున ఎంపీ మిథున్‌రెడ్డి బిల్లును వ్యతిరేకించారన్నారు. వక్ఫ్‌చట్టం సవరణ బిల్లు రాజ్యాంగ స్ఫూర్తిపై దాడి అని, మతపరమైన విభజనను సృష్టించడమే కాకుండా వక్ఫ్‌బోర్డులకు ప్రస్తుతం ఉన్న అపరిమిత అధికారాలకు చెక్‌పెట్టే దిశగా ఉందని తెలిపారన్నారు. ఎన్డీఏ కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు...ఎన్నికల సమయంలో బీజేపీతో పొత్తు కుదుర్చుకునేటప్పుడు ముస్లింలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూస్తానని హామీ ఇచ్చారన్నారు. అలాగే స్థానిక మైనారిటీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా టీడీపీ, బీజేపీతో పొత్తులో ముస్లింల హక్కులకు భంగం కలగకుండా చూస్తానని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం వాటిని నిలుపుకునే దిశగా వక్ఫ్ చట్టం సవరణ బిల్లు అమల్లోకి రాకుండా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. మైనారిటీ నాయకులు గుండ్లూరు రఫీ మాట్లాడుతూ..ముస్లింలు ఎన్డీఏ కూటమికి గత ఎన్నికల్లో మద్దతు పలకలేదనే కారణంతో బీజేపీ ప్రభుత్వం వారికి వ్యతిరేకంగా వక్ఫ్‌భూములను దొడ్డిదారిన స్వాధీనం చేసుకునేందుకు సవరణబిల్లును తీసుకువచ్చిందన్నారు. మదనపల్లెలో రూ.500 కోట్ల విలువచేసే ఆస్తులు వక్ఫ్‌భూములుగా ఉన్నాయని, టీడీపీకి చెందిన ఓ నాయకుడు వక్ఫ్‌భూములు 8 ఎకరాలను ఆక్రమించుకుని, కోర్టులో కేసు వేశారని, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వాటిని సంరక్షించే దిశగా చొరవచూపాలన్నారు. సమావేశంలో మైనారిటీ నాయకులు సలీం, నూర్ మొహిద్దీన్‌ఖాన్, యూనుస్, హబీబ్, యాసీన్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఏసీ తహసీల్దార్ల మతలబేంటో?

- బి.కొత్తకోట, పీటీఎంకు మాత్రమే రెగ్యులర్ తహసీల్దార్
- ఆలస్యంగా విధుల్లో చేరిన బి.కొత్తకోట తహసీల్దార్
- మిగతా నాలుగు మండలాలకు డీటీలే తహసీల్దార్లు
- ఎన్నడూలేని విధంగా ఇప్పుడే ఎందుకిలా?



కురబలకోట తహసీల్దార్ కార్యాలయం

బి.కొత్తకోట : ఏదైనా మండలంలో ఒక అధికారి సెలవుపై వెళ్లడమో లేకపోతే ఉద్యోగ విరమణ చేస్తే ఆ అధికారి స్థానంలో కిందిస్థాయి అధికారికి పూర్తి అదనపు బాధ్యత (ఎఫ్ఏసీ)లను అప్పగించడం అనవాయితీ. పైరెండు కాకున్నా అధికారి నియామకంలో జాప్యం జరిగినా ఇలానే చేస్తారు. కానీ తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇటీవల జరిగిన తహసీల్దార్ల నియమకం అనుమానాలకు తావిస్తోంది. ఒకటికాదు రెండు కాదు ఎన్నడూలేని విధంగా నాలుగు మండలాలకు ఎఫ్ఏసీ తహసీల్దార్లను నియమించారు. రెగ్యులర్ తహసీల్దార్లను నియమించకుండా డీటీలకు బాధ్యతలకు ఇవ్వడం వెనుక మతలబెంటని ప్రజలు చర్చించుకుంటున్నారు.

బదిలీ, ఆపై తహసీల్దార్..

ఈనెల 3న కలెక్టర్ శ్రీధర్ ఈనెల 9వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుల్లో తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన నాలుగు మండలాలకు చెందిన డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ..వారిని అదే మండలాలకు పూర్తిస్థాయి తహసీల్దార్లుగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఒకే ఉత్తర్వులో ఇటు బదిలీ, అటు ఎఫ్ఏసీ బాధ్యతలను ఇచ్చారు. ములకలచెరువులో డీటీగా పనిచేస్తున్న డి.హరికుమార్‌ను తంబళ్లపల్లె డీటీగా బదిలీ చేస్తూ..అక్కడే ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా నియమించారు. నిమ్మనపల్లెలో డీటీగా పనిచేస్తున్న జి.తిప్పేస్వామిని కురబలకోట డీటీగా బదిలీచేస్తూ అక్కడే తహసీల్దార్‌గా, కలకడలో డీటీగా పనిచేస్తున్న కే.ప్రదీప్‌ను ములకలచెరువు డీటీగా బదిలీ చేసి, అక్కడే తహసీల్దార్‌గా, కలికిరి డీటీ సయ్యద్ అహ్మద్‌ను పెద్దమండ్యం డీటీగా బదిలీచేసి, అక్కడే తహసీల్దార్‌గా నియమించారు. ఒకేసారి బదిలీ, ఆపై అదనపు బాధ్యతలు అప్పగించే ఉత్తర్వులు రావడం ప్రత్యేకమని రెవెన్యూ వర్గాలు అంటున్నాయి. ఎఫ్ఏసీ తహసీల్దార్లుగా నిమితులైన అధికారులు ఉత్తర్వులు రావడంతోనే కొందరు టీడీపీ నేతలను కలవడం అనుమానాలకు తావిస్తున్నాయి. కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులు స్థానిక ఎమ్మెల్యేలను కలవడం అనవాయితీ. అయితే అధికారులు టీడీపీ నేతలను కలుస్తుండటం స్థానికుల్లో చర్చనీయాంశమైంది.

ఆలస్యంగా విధుల్లోకి ..

బి.కొత్తకోట తహసీల్దార్‌గా పనిచేయాలంటే అధికారులు ఆసక్తి చూపుతుంటారు. ఇక్కడ మంచి అధికారులు పనిచేసి ప్రజలకు ఎంతో సేవచేసి గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఇక్కడి రాజకీయ పరిస్థితులను తెలుసుకుంటున్న అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 3న కలెక్టర్ బి.కొత్తకోట తహసీల్దార్‌గా శ్రీధర్‌రావును నియమించగా ఆలస్యంగా శుక్రవారం విధుల్లో చేరారు. ఆయన ఇక్కడ పనిచేసేందుకు సముఖంగా లేరన్న ప్రచారం జరిగింది. ఉత్తర్వులు జారీ అయిన 13 రోజుల తర్వాత ఆయన బాధ్యతలు చేపట్టారు.

నేడు వైద్యసేవలు నిలిపివేత

పీలేరు రూరల్ : కోల్‌కత్తాలో జరిగిన వైద్యురాలి అత్యాచారం, హత్య కేసులో న్యాయం కోసం డిమాండ్ చేస్తూ, వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠినతరం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఒక రోజు వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. సీబీఐ ఆధ్వర్యంలో త్వరితగతిన నేర పరిశోధన పూర్తి చేసి నేరానికి పాల్పడిన వారిపై కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ వై. పవన్‌కుమార్, కోశాధికారి డాక్టర్ బి. ఈశ్వర్ సురేంద్ర పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య



కోసువారిపల్లె పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ కొండయ్య

తంబళ్లపల్లె : మండలంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డెంగీ, అతిసారాపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య సూచించారు. శుక్రవారం కోసువారిపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఓపి, మెటర్నటీ వార్డు, ల్యాబ్,ఫారసీలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది పనితీరుపై డాక్టర్ మునికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగే విధంగా చూడాలన్నారు. పీఎంవివివై, ఎన్‌సీడీ,ఐడిఎస్‌పి, ఇమ్యునైజేషన్ కార్యక్రమాలపై సూచనలు ఇచ్చారు. విధి నిర్వహణలో ఎవరూ నిర్లక్ష్యంవహించరాదని హెచ్చరించారు. అనంతరం తంబళ్లపల్లె సీహెచ్‌సిని సందర్శించి మండలంలో జ్వరపీడితులు, అతిసారి బాధితులు గురించి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్యతో చర్చించారు. ఆయన వెంట వైద్యసిబ్బంది ఉన్నారు.